ప్రజాశక్తి
www.prajasakti.com
గురువారం 11 మే 2023



ఏడుగురిపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల


పట్టణ పరిధిలోని జగనన్న లేఅవుట్లో జనవరిలో జరిగిన అవకతవకల విషయంలో ఏడుగురు సచివాలయ అమినిటీస్ సెక్రటరీలను సస్పెండ్ చేస్తూ గత నెల 27న పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ శ్రీనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా వారిపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ పేర్కొన్నారు. బుధవారం పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ నుంచి ఉత్తర్వులు అందాయని, తాత్కాలికంగా ఎత్తివేసినట్లు తెలిపారు. జగనన్న లే అవుట్లో 68 గృహాలకు సంబంధించి రూ.44,86,900 అవకతవకలు జరిగాయని రుజువు కావడంతో ఏడుగురిని గతంలో సస్పెండ్ చేశారు. హెల్త్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు విచారించి దాని ఆధారంగా సస్పెన్షన్ ఎత్తివేశామని కమిషనర్ చెప్పారు.

ట్రూఅప్ పేరిట ప్రభుత్వం కరెంటు ఛార్జీలను పెంచేసింది. 2023 ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలను పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. యూనిట్‌కు సగటున 23 పైసలు చొప్పున పెంపుదల అనివార్యమైంది. జిల్లాపై రూ.రెండు కోట్ల మేర భారం పడింది. జిల్లాలోని వ్యవసాయ అనుబంధ రంగాలైన ఆక్వా కల్చర్, రొయ్యల సాగు, కోళ్ల పరిశ్రమ, గృహావసరాలు, కమర్షియల్, ఇండస్ట్రియల్, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయ సర్వీసుల వరకు విద్యుత్ కనెక్షన్లన్నిటికీ కరెంటు ఛార్జీల పెంపు ఖాయమని తేలిపోయింది. ప్రభుత్వం పేద, ధనిక తారతమ్యం పాటించకుండా ట్రూఅప్ ఛార్జీలను బాదేయడం పట్ల విమర్శల వర్షం కురుస్తోంది.



ట్రూ'అప్'...షాక్!

యూనిట్‌కు రూ.23 పైసలు పెంపు
జిల్లాపై రూ.2.5 కోట్ల భారం
ఏప్రిల్ నుంచి పెంపు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో 10.85 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో 7.96 లక్షల గృహాల విద్యుత్ కనెక్షన్లు, 85.8 వేల వాణిజ్య కనెక్షన్లు, 4,211 పరిశ్రమల కనెక్షన్లు, 2.70 లక్షల ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాల సర్వీసులు, 1.71 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో హెచ్‌టిఎస్‌సి 267 సబ్‌స్టేషన్ల పరిధిలో ఆరు కేటగిరీలుగా విద్యుత్ కనెక్షన్లను విభజించారు. వీటన్నింటి పరిధిలోని కనెక్షన్లన్నింటికీ ట్రూఅప్ ఛార్జీల పెంపును వర్తింపజేసింది. ఫలితంగా రాష్ట్రప్రభుత్వానికి పేద, ధనికులనే తేడాలు లేకుండా ధనికులపై ప్రేమను ఒలకబోయడం తాను ధనికుల పక్షపాతిని అనే ముద్రను స్థిరం చేసుకుందనే విమర్శలు సుస్థిరం చేసుకుందని చెప్పవచ్చు.

2014 నాటి భారం షురూ!

2014 నుంచి 2019 వరకు వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూప్‌ఛార్జీలను పెంచేసింది. 2022 ఆగష్టు నుంచి 2025 జులై వరకు యూనిట్‌కు రూ.23 పైసలు చొప్పున పెంచేసింది. 2025 జులై వరకు ప్రతి నెలా ట్రూఅప్ పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయనుంది. ఈ ఏడాది మార్చిలో 10.96 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగమైంది. నెలకు ట్రూఅప్ ఆదాయం రూ.70 కోట్లు వసూలైంది. 2023 ఏప్రిల్‌లో 11 లక్షల యూనిట్లు వినియోగం కానుందని అంచనా. జిల్లాపై సుమారు రూ.2.5 కోట్లకు పైగా భారం పడనుంది. నెలకు రూ.72.5 కోట్ల మేర ఆదాయం సమకూరనుంది.

పేదలను కొట్టి..

ట్రూఅప్ ఛార్జీల పెంపుదల సామాన్యులను సమిధలుగా మార్చాయనే వాదన వినిపిస్తోంది. జిల్లావ్యాప్తంగా బిపిఎల్ కేటగిరీ కింద ఎనిమిది లక్షల కుటుంబాల వరకు ఉన్న సంగతి తెలిసిందే. పేదల ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు ఇటువంటి సామాన్యులను ఛార్జీల పెంపుదల నుంచి మినహాయించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రస్తుత ట్రూఅప్ ఛార్జీల పెంపు విషయంలో జిల్లాలోని 85 వేల కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు, 4,211 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్ల మీద ట్రూఅప్ ఛార్జీల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం సమంజసం. ఇటువంటి ఆలోచన చేయకుండా సామాన్య విద్యుత్ వినియోగదారుల మీద ట్రూఅప్ ఛార్జీల భారాన్ని వేయడం పట్ల సర్వత్రా విమర్శల వర్షం కురుస్తోంది.

గత పెంపుదలకు భిన్నంగా

గత కరెంటు ఛార్జీల పెంపుకు భిన్నంగా ఛార్జీలను పెంచింది. గతంలో కరెంటు ఛార్జీల పెంపుదలను పరిశీలిస్తే శ్లాబ్ రేట్ల ప్రకారం పెంచేయడం తెలిసిందే. దీన్నిబట్టి గమనిస్తే పేదల విద్యుత్ వినియోగం పరిమితం. దీన్నిబట్టి పేదలపై భారం పరిమితంగానే ఉండేది. తాజా ట్రూఅప్ ఛార్జీల విషయంలో పేద, ధనిక కనెక్షన్ల తారతమ్యం లేకుండా ఛార్జీల పెంపు అనివార్యమైంది. జిల్లాలోని కమర్షియల్, విద్యుత్ కనెక్షన్లపై ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేయడానికి బదులుగా కరెంటు కనెక్షన్లన్నిటికీ ఛార్జీలను పెంచడంపట్ల విమర్శల వర్షం కురుస్తోంది. బిలోస్టేబిల్ వినియోగదారులకు వాత పెట్టనుండడం అర్థమవుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో దళిత కాలనీల్లో ఒక బల్బును ఉపయోగించుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం ఆయన ప్రవేశపెట్టిన ఒక బల్బు ఉచిత విద్యుత్ వినియోగ పథకానికి తిలోదకాల్చింది. ఫలితంగా లక్ష మందికిపైగా ఒక బల్బు లబ్ధిదారులు నష్టవడం తెలిసిందే. తాజా ఛార్జీల పెంపుదలతో దళితుల పైనా భారం పడడం ఖాయమని తేలిపోయింది. ఛార్జీల పెంపును పరిశీలిస్తే సామాన్య, పేద, దళిత, అనే తేడా లేకుండా ఛార్జీల భారం ఖాయమని తేలిపోయింది.

నాణ్యమైన పరిష్కారం కోసం

జగనన్నకు చెబుదాం : కలెక్టర్

1902 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
అర్జీదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - కడప

అర్జీల ద్వారా పరిష్కారానికి సాధ్యం కాని సమస్యలను 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసి వేగవంతమైన, నాణ్యమైన పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లాలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ఎస్‌పి అన్బురాజన్, జెసి గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిఆర్‌ఒ గంగాధర్‌గౌడ్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రతి సోమవారమూ నిర్వహించడంతో పాటు జిల్లా స్థాయిలో రోజూ ప్రజల నుండి వినతులు స్వీకరిస్తూ సమర్థవంతంగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 42,433 ఫిర్యాదులు నమోదు కాగా అందులో 41,616 ఫిర్యాదులకు సకాలంలో నాణ్యమైన, సంతృప్తి కరమైన పరిష్కారాలను అందించామన్నారు. ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐఎఎస్ అధికారులు నెలకు రెండు పర్యాయాలు జిల్లాల్లో పర్యటించి కార్యక్రమం అమలు తీరును పరిశీలిస్తారని చెప్పారు. ఈ వినూత్న ప్రాజెక్టు విధానం ద్వారా నాణ్యమైన, సంతృప్తికరమైన, పారదర్శకమైన పరిష్కారం అందుతుందన్నారు. కార్యక్రమం విజయవంతంగా నడిచేందుకు జిల్లా స్థాయిలో ఆడిట్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో జడ్‌పి సిఇఒ, సిపిఒ, ఎస్‌డిసి, ఇఒపిఆర్‌డి, డిప్యూటీ తహశీల్దార్, మెడికల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారన్నారు. టీమ్ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు పరిశీలించి విశ్లేషణ చేయడంతో పాటు 15 రోజులకు ఒకసారి సంబంధిత నివేదికలను తనకు, ఎస్‌పి అందజేస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పిఎంయును ఏర్పాటు చేసి ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు ఎదురైనా 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో సిపిఒ వెంకటరావు, సమాచార శాఖ ఏడి వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ విజయకుమార్ పాల్గొన్నారు.

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కమ్యూనిస్టు నాయకులు, తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను ఈనెల 19న నగరంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. బుధవారం వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుందరయ్య 1985, మే, 19న మరణించారని, ఇప్పటికీ ఆయన ఆచరించిన సిద్ధాంతం, విలువలు నేటికీ పలువురికి ఆదర్శ ప్రాయమన్నారు. సమాజంలో రోజురోజుకూ మార్పులు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సుందరయ్య చేసిన త్యాగాలు, ఆయన ఆచరించిన విలువలు బావితరాలు ఆదర్శప్రాయంగా తీసుకోవాలన్నారు. వర్ధంతి సభకు సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, ఫారుక్ హుస్సేన్, ఓబులేసు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా ఫెప్ పి సి నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమామహేశ్వర్ ను డిఎంహెచ్ఒ కార్యాలయంలో కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 104 నాయకులు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన మాట మరచిపోయారని పేర్కొన్నారు. జీతాలు రాక ఉద్యోగులు దుర్భారమైన జీవితం గడుపుతున్నామని చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రతినెలా ఐదో తారీఖున జీతాలు ఇచ్చి మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 104 యూనియన్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అలీ, జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సిబ్బంది మహేష్, సురేష్ నాగేంద్ర, మల్లేశరెడ్డి రహంతుల్లా బాలరాజు రమణ గంగాధర్ అలీ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సంచార వైద్యం, ఫ్యామిలీ డాక్టర్ సేవలు విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 104 వైద్య సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలు పరిష్కరించాలని కల్లూరు పి హెచ్‌సి 104 వాహన వైద్య ఉద్యోగులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కల్లూరు పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ శివప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో 104 వాహన సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

చింతకొమ్మదిన్నె : స్థానిక గ్రంథాలయంలో వేసవి వినోదంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి. ఇబ్రహీం మాట్లాడుతూ రోజూ విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

కడప : జిల్లా వ్యాపతంగా ఈనెల 13న ఉదయం 10.30 గంటలకు నుంచి ప్రారంభమయ్యే జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలకు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 08562 258622, 244622లలో కానీ, districts.ecourts.gov.i n/Kadapa, dlsakdp@gmail.com ద్వారా కానీ సంప్రదించాలన్నారు.

తెలుగుపులి వెంకటసుబ్బమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే

కడప : వైసిపి నగర మహిళా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మను ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. ఆమె ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం కమలాపురం ఎమ్మెల్యే ఆమె స్వగృహానికి వెళ్లి ఆరోగ్య యోగ క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

విద్యా కానుక స్టాక్ పాయింట్ పరిశీలన

చింతకొమ్మదిన్నె: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న యూనిఫారం నాణ్యత ప్రమాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు ఇవ్వబోయే యూనిఫారం, బ్యాగు, బెల్టు, షూ, సాక్స్‌లు 2023- 24 అకాడమిక్ విద్యా సంవత్సరానికి ఇవ్వడానికి సిద్ధం చేశామని ఆయన తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 1,58,157 మంది విద్యార్థులకు ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు స్కూల్స్ పునఃప్రారంభం రోజున విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వెంకట రామిరెడ్డి సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి కొండా దశరధి రామిరెడ్డి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ భాస్కర్, ప్రతాప్ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఆర్ట్ టీచర్ గురవయ్య పాల్గొన్నారు.



స్టాక్‌పాయింట్‌ను పరిశీలనలో ఎస్‌ఎస్‌ఎ పిఒ ప్రభాకర్‌రెడ్డి

సెలవుల్లో ఉపాధ్యాయులకు విధులు సరికాదు

ప్రజాశక్తి - కడప అర్బన్

వేసవి సెలవులలో ఉపాధ్యాయులను విధులు నిర్వహించమని విద్యాశాఖ అధికారులు పేర్కొనడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ పేర్కొన్నారు. వేసవి సెలవులలో ఉపాధ్యాయులు రోజూ పాఠశాలకి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేయడాన్ని నిరసిస్తూ, తక్షణమే ఆ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఇఒను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా కొనసాగుతున్న విద్యాశాఖలో పాఠశాలలకు సెలవులు ప్రకటించిన రోజు నుండే ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా పాఠశాలలకు వెళ్లి నాడు-నేడు పనులను పర్యవేక్షించాలనడం, 10 వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని ఆదేశాలివ్వడం, పాఠశాలలకు హాజరు కాకపోతే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొనడం సబబుగా లేదన్నారు. అధికారుల వైఖరి వల్ల వేసవి సెలవులలో సుదూర ప్రాంతాలకు ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయుల కృషి వల్ల పదవ తరగతిలో మంచి ఫలితాలు వచ్చినప్పటికీ అధికారులు ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లాలని నిర్బంధ ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఫ్యాప్టో పక్షాన వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరుకావాలని అధికారులు రాతపూర్వక ఆదేశాలు ఇవ్వకుండా, మౌఖిక ఉత్తర్వుల ద్వారా పాఠశాలకు వెళ్లాలని కోరడం తగదన్నారు. ఇలాంటి నిర్బంధ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించగా డిఇఒ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఫ్యాప్టో వినతి పత్రాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కోశాధికారి జి.చెన్నకేశవరెడ్డి, నాయకులు జి.వెంకటసుబ్బారెడ్డి, పాలెం మహేష్ బాబు, కె.ఖాదర్ బాషా, ఆర్.అబ్దుల్లా, వి.వంశీకృష్ణ, ఎం.నాగభూషణం పాల్గొన్నారు.



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

హిందూ, ముస్లిములను ఏ దుష్ట శక్తీ విడదీయలేదు

ప్రజాశక్తి- కడప అర్బన్

దేశంలోని హిందూ, ముస్లిమ్ సోదరుల అనుబంధాన్ని ఏ దుష్ట శక్తీ విడదీయలేదని అందుకు అసత్యాలతో తీసిన కేరళ స్టోరీ వల్ల ఎటువంటి చిచ్చు రగలక పోవడమే నిదర్శనమని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం వైవి స్ట్రీట్‌లో ఉన్న సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలో ఐదేళ్లుగా 41,628 మంది మహిళలు అదృశ్యం అయ్యారని పోలీస్ స్టేషన్‌లలో నమోదైన మిస్సింగ్ కేసులు చెబుతున్నాయన్నారు. కేవలం కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికల దృష్ట్యా హిందు-ముస్లిముల మధ్య వ్యతిరేక భావం సృష్టించి పబ్బం గడుపుకోవాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ ఆడిన నాటకమే కేరళ స్టోరీ సినిమా అన్నారు. అది బెడిసికొట్టడం, హిందు సోదరులే ప్రశ్నల వర్షం కురిపించడంతో బిజెపి దాని అనుబంధ సంస్థలు మౌనం వహించారన్నారు. మోడీ మీడియా నోరు మెదపడం లేదన్నారు. భారత దేశం లౌకికత్వానికి, సమైక్యతకు, మత సామరస్యానికి నిదర్శనమని తెలిపారు. సమావేశంలో శివచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సలావుద్దీన్

మహార్దశ



భూ కేటాయింపునకు సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

డాక్టర్ వైఎస్ఆర్ ఎఎఫ్‌యూకు భూమి కేటాయింపు
రూ.345 కోట్లతో నిర్మాణాలకు ప్రతిపాదనలు
జులై 8న సిఎం చేతులు మీదుగా శంకుస్థాపన

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీకి భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2020లో యూనివర్శిటీ ఏర్పాటైంది. నగర పరిధిలోని చలమారెడ్డిపల్లెలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు స్థల కేటాయింపులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతంలో సరైన మౌలిక వసతులు లేకపోవడం కారణంగా పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామ పరిధిలోని 17/1, 17/2 తదితర సర్వే నంబర్లలో 110.36 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. వైవీయూకు సమీపంలోనే ఈ స్థలం ఉండడం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. రెండు యూనివర్సిటీలు పక్కపక్కనే ఉండడం వల్ల విద్యాభివృద్ధికి ఎంతో దోహద పడుతుంది.

కేంద్ర నిధులకు ప్రయత్నం

14 స్పెషలైజేడ్ కోర్సులతో రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయంగా ఏర్పాటైన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి రాష్ట్రం తో పాటు కేంద్ర నిధులు తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులు, అధి కారులు కృషి చేస్తున్నారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి గతంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిశారు. యూనివర్సిటీకి రూ. 250 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి సైతం నిధులు కేటా యిం చమని కోరారు. జులై 8న సిఎం శంకుస్థాపన చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటూ ఉన్నారు.

శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు..

విశ్వవిద్యాలయం నెలవారి అద్దె చెల్లించి ప్రస్తుతం గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. వీలైనంత త్వరగా సొంత భవనాలు సమ కూర్చుకొని వెళ్లేందుకు అధికారులు పనులను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రూ.345 కోట్లతో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టాలన్న దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ శంకుస్థాపన చేయించాలన్న ఆలోచనలో విశ్వవిద్యాలయ అధికారులు ఉన్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసేందుకు విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్ రెడ్డి సన్నాహాలు ప్రారంభించారు.

భూ కేటాయింపు హర్షణీయం



డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి ప్రభుత్వం భూమి కేటా యించడం హర్షణీయం. 110.36 ఎకరాల స్థలాన్ని ఇవ్వడం సంతోషం. జులై 8న నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజకు, శంకుస్థాపనకు కృషి చేస్తున్నాం. దీంతో యూనివర్సిటీకి శాశ్వత భవనాలు సమ కూరుతాయి.

- ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, విసి

భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు



రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ శాశ్వత భవన నిర్మాణాలకు ప్రతిపాదనలను సిద్ధం చేశాం. రూ. 345 కోట్లతో అంచనాలు వేశారు.. అను మతులు లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తారు. ఇందుకు సహకరించిన ప్రజా ప్రతినిధులు అధికారులకు ధన్యవాదాలు.

-ఆచార్య ఇ.సి. సురేంద్ర నాథ్ రెడ్డి, రిజిస్ట్రార్.

అమరావతితోనే రాష్ట్రాభివృద్ధి

కడప అర్బన్ : అమరావతి రైతులకు చట్టపరంగా ఇవ్వాల్సిన హక్కులు ప్రభుత్వం ఇవ్వాలి, లేదంటే ప్రభుత్వం ఇంకా ప్రజల్లో అబాసూపాళ్లవుతుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. బుధవారం పాత బస్టాండ్ సమీపంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుంచి అమరావతిని అంతం చేయాలని ప్రభుత్వం, ఎమ్మెల్యేలు చూస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాలు కాపాడుతూ వస్తున్నాయని చెప్పారు. అమరావతిని వ్యతిరేకించిన ఎమ్మెల్యేలు భవిష్యత్తులో అసెంబ్లీకి వెళ్ళలేరని స్పష్టం చేశారు. దూరదృష్టి తో రాజధానిని అభివృద్ధి పరిస్తే అది రాష్ట్రానికి ఒక మంచి అక్షయ పాత్ర అవుతుందని తెలిపారు. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారని చెప్పారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ పి. సుధాకర్ యాదవ్, టిడిపి మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి నజీర్, రాష్ట్ర ట్రెజరర్ ఆర్. హుస్సేన్, బిసి సెల్ కార్యదర్శి దస్తగిరి, నాయకులు ఖాదర్ సాబ్ పాల్గొన్నారు.

లక్ష్మీ చేతనను అభినందించిన నారా లోకేష్

ప్రజాశక్తి - కడప

ఎస్‌ఎస్‌సి -2023 ఫలితాలలో 596 మార్కులు సాధించిన వికాస్ స్కూల్ విద్యార్థిని బి. లక్ష్మీ చేతన, స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ బుధవారం కర్నూలు జిల్లాలో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌ను పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ విద్యార్థిని బి.లక్ష్మీ చేతన 596 మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీ చేతన తల్లిదండ్రులు జి. రోజా రాణి, శంకర్ నారాయణ స్కూల్‌హెచ్‌ఎం హమీద్, 22, 44,46, డివిజన్ శ్రీనివాసులు, ఖాజా పీర్,భరత్ టిడిపి నాయకుడు నెట్టుపల్లి శివరాం పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న లోకేష్

మట్టి మాఫియాను అదుపు చేయండి

ప్రజాశక్తి - కడప

కడపలో మట్టి మాఫియా యథేచ్ఛగా సాగుతుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అదుపు చేయాలని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ డిమాండ్ చేశారు. మట్టి మాఫియాను అదుపు చేయకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక, ఎర్రచందనం, మద్యం, భూ మాఫియాల కంటే మిన్నగా మట్టి మాఫియా తయా ైందని ఆరోపించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అండదండలతో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది అని అన్నారు. ఇష్టం వచ్చినట్లు తవ్వుకుంటూ మట్టిని మనీ చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధిత అధికా రులు అందరూ బాధ్యులే అవతారన్నారు. భవిష్యత్తు తరాల అవసరం కోసం మట్టిని కాపాడకపోతే అనేక ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి వెంటనే మట్టి మాఫియాను అదుపు చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరి ప్రసాద్ గౌడ్, ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి జకరయ్య

ప్రజలను మభ్యపెట్టడానికే జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గతంలో ఇచ్చిన నవరత్నాల్లో ఏమి సాధించారని, ఇప్పుడు ప్రజల మభ్యపెట్టడానికే 1902 జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టారని మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలను మోసగిస్తూనే పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో వస్తున్న సమస్యలు ఇంతవరకు పరిష్కారం కాలేదని ప్రజలను మభ్య పెట్టేందుకే జగనన్నకు చెబుదాం, జగనన్న మా భవిష్యత్తు లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఎలా అధికారంలోకి రావాలని ఆలోచనలోనే ఇవన్నీ చేస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేదని పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బి లాంటి డిపార్ట్‌మెంట్‌లో ఒక్క రూపాయి పని చేయకుండా ఖాళీగా ఉన్నారన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రొద్దుటూరుకు ఎన్ని కోట్లు ఖర్చు చేశారో చెప్పాలన్నారు. శిలాఫలకం కదుతున్న నూతన మార్కెట్ ఫుట్‌పాత్ వర్క్ మూడు అడుగుల మేర వేయడం ఏమిటని ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వ డబ్బులు నిర్వీర్యం చేసేందుకే అన్నారు. ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధి కేవలం హామీలు మాత్రమే ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. కేవలం మున్సిపాలిటీ నిధులు మాత్రమే వినియోగిస్తున్నారని అన్నారు. గవిని సర్కిల్ నుంచి ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు వరకు వేస్తున్న సెంట్రల్ లైటింగ్ ఎంత ఖర్చు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేవలం వారి సొంత ప్రయోజనాల కోసమే అంత ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి

రైతులకు రక్షణ భూ హక్కు పథకం

ముద్దనూరు : రైతులకు రక్షణగా ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని అమలు చేస్తోందని వైసిపి నాయకులు శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గ్రామంలో గ్రామ నాయకులు శంకర రెడ్డి, శ్రీధర్ రెడ్డి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు,భూ రక్ష పథకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకాలన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దాల్మియా విద్యా మందిర్ ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం

మండల పరిధిలోని చిన్నకొమ్మెర్ల వద్దనున్న దాల్మియా పరిశ్రమలో దాల్మియా విద్యామందిర్ పాఠశాలను హెడ్ ముఖేష్ కుమార్ సింహ, ఆయన సతీమణి కంజత ముఖేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దాల్మియా సంస్థ అధినేతలైన పునీత్ దాల్మియా, గౌతమ్ దాల్మియా వారి పరిశ్రమలల్లో దాల్మియా విద్యా మందిర్ పాఠశాలలు అనేకము న్నాయని, ఇప్పుడు ఇక్కడ మరో పాఠశాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ 2023-24 విద్యా సంవత్సరానికి గాను నర్సరీ నుంచి ఐదవ తరగతి వరకు సిబిఎస్ సిలబస్ ఉంటుందని చెప్పారు. అధునాతన సౌకర్యాలు, పూర్తి డిజిటలైజ్డ్ తరగతులు నిర్వహిస్తారన్నారు. దాల్మియా పరిశ్రమ చుట్టుప్రక్కల గ్రామాల పిల్లలకు అత్యుత్తమ విద్యను అందించడమే తమ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాల్మియా విద్యా మందిర్ సిఇఒ డాక్టర్ రోసెట్ట విలియం, ఆల్ ఇండియా నేషనల్ మ్యాను ఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ చిరుకుంతర్, యాదవహరి అభినందనలు తెలియజేశారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న ముఖేష్‌కుమార్ సింహా

వివాహానికి ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): విభిన్న ప్రతిభావంతురాలి సుజాత కుమార్తె వివాహానికి వైసిపి జిల్లా జిల్లా పార్లమెంటరీ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ ఎంపీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు వినయ్ కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో రూ.5000 ఆర్థిక సాయం అందించారు. బుధవారం విభిన్న ప్రతిభావంతుల తరఫున మంచి మనసుతో ఆలోచించి తన వంతు సహాయం చేసినటువంటి వినయ్ కుమార్ రెడ్డికి సుజాత కుటుంబం తరపున దాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, నారాయణ, సుజాత పాల్గొన్నారు.

రూ.3.38 కోట్లతో కెసి కాలువ అభివృద్ధి పనులు

చాపాడు: మండల పరిధిలో కెసికాలువలో మరమ్మతు, ఉపకాల్వలో సిమెంట్ లైనింగ్ తదితర అభివృద్ధి పనులను రూ. 3.38 కోట్లతో చేపడుతున్నట్లు కెసి కెనాల్ ఎఇ జాన్సన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చాపాడు ఛానల్ ఏటూరు కాల్వ పరిధిలో కెసి కాలువ దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఉప కాలువలలో సిమెంట్ లైనింగ్ ఏర్పాటుకు టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా పూడికతీత, కట్టల మీద కంపచెట్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆగస్టులో కెసికి నీరు వచ్చే సమయానికి కాలువలు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్‌టిడి డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక పట్టణ పరిధిలోని రాణీ తిరుమలాదేవి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, దీపా వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులు 60 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ టి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న మనిషి ప్రాణాన్ని రక్షించడానికి రక్తం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదిలో కనీసం రెండుసార్లైనా తమ రక్తాన్ని బ్లడ్ బ్యాంకులకు దానం చేస్తే ఎంతో మంది క్షతగాత్రులకు, ఆపదలో ఉన్న రోగులకు ఉపయోగపడుతుందని అన్నారు. రక్తదానం చేయడం వల్ల వ్యక్తుల ఆరోగ్యం సక్రమంగా ఉండడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి,కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్ బదిలీ

లింగాల : మండల తహశీల్దార్ శేషారెడ్డి వేముల మండలానికి బదిలీ అయ్యారు. ఏడేళ్లుగా డిప్యూటీ తహశీల్దార్ చేశారు. గత ఏడాది నుంచి తహశీల్దార్‌గా సేవ లందించారు. వేముల తహశీల్దార్ లక్ష్మినారాయణ ఇక్కడి బదిలీ పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు

లింగాల : మండల పరిధిలోని మురారి చింతల గ్రామంలో నిర్వహించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, దంతులూరి కృష్ణ పాల్గొన్నారు. అనంతరం వారు స్వాముల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, ఎంపిపి, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ, బైకు ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మండలంలోని నాగలకుంట్ల పెట్రోల్ బంక్ సమీపంలో ప్రధాన రహదారిపై లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ప్రకాశం జిల్లా దర్శి మండలం, గుర్రాల కాలనీకి చెందిన దాసరి సిద్ధయ్య (32) అనే వ్యక్తి స్వగ్రామం నుంచి పోరుమామిళ్లకు బయలు దేరాడు. పోరుమామిళ్ల వద్దకు రాగానే పోరుమామిళ్ల నుంచి ప్రకాశం జిల్లాకు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటనపై విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఉపాధి.. సౌకర్యాలు మొక్కుబడి

కానరాని కనీస మౌలిక వసతులు

అలవెన్సులు గాలికి

బడ్జెట్‌లో నిధులు తగ్గింపు

ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు



గ్రామీణ పేదలకు జీవనోపాధిగా మారిన ఉపాధి పనులు తూతూ మంత్రంగా అమలవుతోంది. కూలీలు పనిచేసే ప్రాంతంలో కనీస వసతులు కల్పించడంతో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వేసవిలో ఉపాధి కూలీలకు భద్రత లేకుండా పోయింది. మండుటెండలో పనిచేసి కాసేపు సేద తీరుదామంటే నిలువ నీడ లేదు. పని చేసే ప్రాంతంలో టెంట్లు కానీ, మజ్జిగ కేంద్రాలు కానీ ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేని స్థితిలో అధికార యంత్రాంగం ఉండటం గమనార్హం.

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మండలంలో 12,671 జాబ్ కార్డులున్నాయి. రోజూ 17106 మంది కూలీలు పనికి వెళుతున్నారు. 17 గ్రామ పంచాయతీలో పంట కాలువలు, కోనేటి గుంతలు, చెక్ డాం, కుంటలో పూడికతీత, నీటి నిలువ కందకాలు, పంట కందకాలు పనులు జరుగుతున్నాయి. పని ప్రదేశంలో టెంట్లు, చలివేంద్రాలు కానరావడం లేదు. గతంలో ఎండలకు ప్రతి గ్రూపులో చలువ పందిళ్లు ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడాది ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఎండ తీవ్రతకు కూలీలు విలవిలలాడిపోతున్నారు. పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో కూలీలు ఇంటి నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నారు. అవి ఎండకు వేడెక్కి పోవడంతో తాగలేక పోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీలో మాత్రమే అరకొరగా మంచినీటి చలువ కేంద్రాలను కూలీలు ఏర్పాటు చేసుకున్నారు.

అలవెన్సులు గాలికి..

గతంలో ఏప్రిల్, మే నెలలో 30 శాతం, మార్చి జూన్‌లో 25 శాతం, ఫిబ్రవరి, జులైలో 20 శాతం అల వెన్సులు కూలీలకు అమలు చేసేవారు. ప్రస్తుతం ఆ ఊసేలేదు. గతంలో గ్రూపులోని ఒక్కొక్క సభ్యుడికి రెండు రూపాయలను మేట్‌కు ప్రభుత్వం అందజేసేది. కూలీలకు తట్ట, గడ్డపార, మజ్జిగ, చలువ పందిళ్లను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేవి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయడం జరిగింది.

కూర్చోవడానికి వీలు లేకుండా..

ప్రస్తుతం పని ప్రదేశంలో ఎక్కడా టెంట్లు లేవు. టెంటు లేకపోవడంతో కనీసం అల్పా ఆహారం తీసుకునే సమయంలో కూర్చోవడానికి వీలు ఉండటం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్‌లో తగ్గిన నిధుల కేటాయింపు..

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 2022 నుంచి ఎన్ఐసి యాప్‌ను ప్రవేశపెట్టి ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన పనులను దేశం మొత్తం ఈ యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పని దినాలలో కోత కోస్తూ బడ్జెట్లో నిధులు కేటాయింపు తగ్గించింది. గతంలో ఉదయం ఒక్కసారి మాత్రమే మస్టర్‌లో హాజరు వేస్తూ ఉండేవారు. ప్రస్తుతం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా హాజరు వేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కూలీలు, మేట్ల మధ్య అవగాహన లోపించి సమస్యల్లో చిక్కు కుంటున్నారు. ఒక గ్రూపులోని సభ్యులందరూ పనికి వెళతామని డిమాండ్ పెట్టినా తర్వాత, గ్రూపు లోని సభ్యులు వ్యక్తిగత కారణాల వల్ల పనికి వెళ్లలేకపోతే పని దినాలు తగ్గిపోవడం ఉపాధి కూలీలను ఆందోళనకు గురిచేస్తుంది.

ప్రభుత్వం టెంట్లను పంపిణీ చేయలేదు...

మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐదుగురు టెక్నిక్ అసిస్టెంట్లు ఒక బిఎఫ్‌టి ఉన్నారు. ఉపాధి పనులను వారు పరిశీలిస్తూ మాస్టర్లలో ఉదయం, మధ్యాహ్నం హాజరు వేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం టెంట్ల ను పంపిణీ చేయలేదు. గడ్డపార, తట్ట, మజ్జిగ మంచినీటి సౌకర్యానికి సంబంధించిన ఛార్జీలను రద్దు చేసింది. ఐదు కిలోమీటర్లు దాటితే ట్రావెలింగ్ అలవెన్స్ మాత్రమే ఇస్తున్నారు. పని విధానంపై ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేశాం.

-ఖాజా, ఇసి, పోరుమామిళ్ల.

మౌలిక వసతులు కల్పించాలి



ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు అలవెన్స్, మజ్జిగ, మంచినీటి సదుపాయం, టెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలి.

- బాలయ్య, ఉపాధి కూలీ, పోరుమామిళ్ల

బిసిలకు అన్యాయం : టిడిపి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాష్ట్ర ప్రభుత్వం బిసిలను ఆర్థికంగా, సామాజికంగా అన్యాయం చేస్తుందని, రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా జనాభాగా ఉన్న వెను కబడిన తరగతులకు మూడేళ్ల నుంచి తీవ్రమైన అన్యాయం జరుగుతోందని, చేతివృత్తులు, కుల వృత్తులు చేసుకుంటూ జీవనం పొందే బిసిల అభివృద్ధి, పురోభివృద్ధి లేకుండా పోయిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.వి. ప్రవీణ్ కుమార్‌రెడ్డి విమర్శిం చారు. భాగంగా డిసిఎస్ఆర్ టింబర్ డిపో రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద నుంచి ఇదేమీఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసిల హక్కుగా పొందాల్సిన సబ్ ప్లాన్ నిధుల నుంచి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వరకు ప్రతి అంశం లోనూ నిరాదరణకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని తెలిపారు. 10 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలని, అం దుకు ఎంపీలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి చేయాలని పేర్కొన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి 14వ వార్డు మస్తాన్ గోలే 9 వార్డు కరీముల్లా మెరువా మూర్తి , గోపవరం గౌస్, భగత్ సింగ్ కాలనీ పట్నం మా భాష, శివ, మహేష్, టిడిపి నాయకులు కార్యకర్తలు నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు : ఈనెల 11 నుండి 13 వరకు జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. గురువారం ఉదయం 9.00 గంటలకు నుంచి శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని జమ్మలమడుగు పట్టణంలో శాసనసభ్యులు డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజుల బండలాగు పోటీలు పిఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరవుతారని వారు తెలిపారు. రోజూ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

చింతకొమ్మదిన్నె: స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12న పుట్టగొడుగుల పెంపకం పై శిక్షణ ఇవ్వనున్నట్లు కెవికె సమన్వయ కర్త డాక్టర్ వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల రైతు సోదరులు హాజరై సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

స్పందనలో పాల్గొనకుంటే చర్యలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు రోజూ మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహించే స్పందనలో పాల్గొన్నాలని లేకపోతే చర్యలు తప్పవని ఎంపిడిఒ వెంగమునిరెడ్డి పేర్కొన్నారు. గ్రామస్తులు తమ సచివాలయ పరిధిలోనే సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని తెలిపారు. స్పందనలో పాల్గొనని అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు.

రథోత్సవం ప్రారంభం

జమ్మలమడుగు : పట్టణంలోని శ్రీ నారాపుర వెంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని శ్రీ నారాపుర వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి రథాన్ని భక్తులతో కలిసి లాగారు. ఉత్సవానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానాలు, చల్లని మజ్జిగ, తాగునీరు, పానీయాలు దాతలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దోడియం విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, హనుమంత్ రెడ్డి , కొండారెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ముఖ్యం

ప్రొద్దుటూరు: పేదల సంక్షేమమే వైసిపి లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆరు గురికి రూ.5.75 లక్షలు విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్కరూ బాధపడకూడదనే ఉద్దేశంతో చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమం తనకు అత్యంత ఇష్టమైందన్నారు. పేదల ముఖంలో చిరునవ్వులు చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీలుగలు మంజూరు

లింగాల : మండలానికి 15 క్వింటాళ్ల జీలుగలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. జీలుగలు 50 శాతం సబ్సిడీ పోగా రూ. 3050 చెల్లించాలన్నారు. జనుము క్వింటాళ్ల సబ్సిడీ పోగా రూ. 4200 రైతులు చెల్లించాలని తెలిపారు.

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ'

కడప : విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కార కోసం ఈనెల 11 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కడపలోని విద్యుత్ భవన్ నుండి 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను 08562- 242457 కు తమ ఇంటి వద్ద నుంచే ఫోన్ చేసి తెలియజేస్తే తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రతినెలా మొదటి సోమవారం అర్జీల స్వీకరణ

కడప : ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించి వారికోసం ప్రత్యేకంగా ప్రతి నెలా మొదటి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ఆర్జీలు స్వీకరిస్తామని డిఆర్‌ఒ గంగాధర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మండల, డివిజనల్, కలెక్టరేట్‌లో మొదటి సోమవారం ఉదయం 10 గంటలనుండి 11 గంటల వరకు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్ నిర్వహించి అందులో ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ పిటిషన్లు స్వీకరిస్తారన్నారు

హెచ్‌ఆర్ఎ పెంపు పట్ల హర్షం

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాలైన నరసరావుపేట, పుట్టపర్తి ,రాయచోటి, పార్వతీపురం, పాడేరు, అమలాపురం, బాపట్ల, రాజమండ్రి. భీమవరం జిల్లాలకు హెచ్‌ఆర్ఎ 12శాతం నుంచి 16 శాతం పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 69 విడుదల చేయడం పట్ల ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.వీ.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి యన్.వి. సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గతంలో మంత్రివర్గ ఉప సంఘంలో జెఎసిలు డిమాండ్ చేయడంతో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల డిమాండ్లను ఒక్కొక్కటి పరిష్కరిస్తూ ఉండటాన్ని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం స్వాగతిస్తుందని పేర్కొన్నారు.

రామాలయానికి భూమిపూజ

చెన్నూరు : మండలంలోని దౌలతాపురంలో నూతనంగా నిర్మించనున్న శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ ఆలయానికి ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 60 ఆలయాలను మంజూరు చేశారన్నారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులందరూ కలసి కట్టుగా ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చాలా అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసి రఘురామ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, గురు మహేష్ రెడ్డి, కరుణాకర్, అఖిల్, రాఘవరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చంద్రగిరిలో గడప గడప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అందులో భాగంగానే గడప గడప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమం వల్ల ప్రతి ఇంటికీ ప్రజా ప్రతినిధుల, అధికారులు వెళ్తుండడంతో వారి సమస్యలు తెలుసుకుని అక్కడే పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పాడా ప్రత్యేక అధికారి అనిల్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకుల పుష్పనాథ్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎపికి తరలించకపోవడం దురదృష్టకరం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానది యాజమాన్యం బోర్డు కార్యాలయాన్ని తొమ్మిదేళ్లయినా తెలంగాణా నుంచి ఎపికి తరలించకపోవడం దురదృష్టకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణానది బోర్డు కార్యాలయాన్ని రాయలసీమలో కాకుండా విజయవాడలో పెట్టాలని తెలుగు దేశం పార్టీ, విశాఖలో పెట్టాలని వైసిపి బోర్డుకు లేఖలు రాయడం శోచనీయమని అన్నారు. హైదరాబాదులోని జలసౌధలో నిర్వహించే కృష్ణా నది యాజమాన్య బోర్డు 17వ సమావేశంలోనైనా బోర్డు కార్యాలయాన్ని హైదారాబాద్ నుంచి కర్నూల్‌కు తరలించే నిర్ణయాన్ని తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ఒక దండగ మారిన కార్యక్రమం అన్నారు. స్పందనకు డూప్లికేటే జగనన్నకు చెబుదాం అన్నారు. స్పందనకే స్పందన లేదు. మరి జగనన్నకు చెబుదాం ఎందుకో అని ప్రశ్నించారు. డబ్బు వృథా, సమయం వృధా అని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు చెప్పిన వాటికే దిక్కు లేదు. మళ్లీ చెప్పి ప్రయోజనం ఏమిటని తులసిరెడ్డి ప్రశ్నించారు. జగన్‌ను దించుదాం అనే కచ్చితమైన నిర్ణయానికి ప్రజలు ఇప్పటికే వచ్చారని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రయోజనం లేదని విమర్శించారు.

కర్ణాటక బిజెపి అభ్యర్థి రాథోడ్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి- పోరుమామిళ్ళ

కర్ణాటక బిజెపి అభ్యర్థి రాథోడ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి అన్వర్ మాట్లాడుతూ చిత్తాపూర్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి విక్రమ్ సింగ్ రాథోడ్, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తో పాటు, వారి కుటుంబ సభ్యులను హత్య చేస్తానంటూ ఫోన్ సంభాషణలో తీవ్రంగా దూషిస్తూ మాట్లాడడం సరైందని కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను యువజన కాంగ్రెస్ నాయకులు సలీం పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో రాజకీయ సందడి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక మధు కన్వెన్షన్ కల్యాణ మండపంలో నిర్వహించిన వివాహపు వేడుకల్లో రాజకీయ సందడి నెలకొంది. బుధవారం టిడిపి నాయకుడు బుసిరెడ్డి సాంబశివారెడ్డి కుమారుడు శివతేజేశ్వర్ రెడ్డి, సుజనాల వివాహం జరిగింది. టిడిపి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీష్ రెడ్డిలతోపాటు వైసిపి నాయకులు హాజరై నూతన వధూవరులను అశ్వీరదించారు. ఈ వివాహపు వేడుకల్లో టిడిపి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి, భరత్ రెడ్డి, ఎల్ బిఆర్ భాస్కర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని మార్కెట్ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుంట కృష్ణ కుమార్ తండ్రి గుంట వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన తండ్రి కూడా సామాజిక సేవ చేసుకుంటూ ఉపాధ్యాయ వృత్తిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని కృష్ణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గుంట విజయమ్మ, గుంట మధు, గుంట రమణమ్మ, దుర్గాప్రసాద్, స్నేహితులు మువ్వ ఓం ప్రకాష్ , భాను ప్రకాష్ రెడ్డి, హితేంద్ర, ఆలయ నిర్వాహకులు చలమారెడ్డి, ప్రతాప్ రెడ్డి, రామిరెడ్డి, రంగారెడ్డి, మల్లారెడ్డి, చంద్ర ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న గుంట కృష్ణకుమార్

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- ఖాజీపేట

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందని ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తుడుమలదిన్నెలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరిస్తూ ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని ప్రజలందరికీ గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, జిల్లా పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, ఎంపీపీ అబూబకర్ సిద్దిక్, వైసిపి నాయకులు ఇరగం రెడ్డి నాగేశ్వర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్ రెడ్డి, అగ్రహార సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, సర్పంచులు పెద్దిరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

మైలవరం : ప్రతి గడపకూ పథకాలు చేరాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తొర్రివేముల సచివాలయ పరిధిలోని పొన్నంపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుండి పథకాలు అందుతున్నాయా లేదా అని అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివ గురువి రెడ్డి, చిన్న కొమెర్ల సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, చరిత బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి, గురివిరెడ్డి,సర్పంచ్ చంద్రశేఖర్ యాదవు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు

మహారాజలంలో (ప్రొద్దుటూరు తన్సిపిల్ జూనియర్ సివిల్ జడ్జి

O.S.NO. 343/2019

తలారి పుల్లయ్య S/o లేట్ తలారి పెద్ద పుల్లయ్య. వయస్సు 45 సంవత్సరాలు, డోర్ నెం. 27/196-C వసంతపేట, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం.కడప జిల్లా. **...వాది**

Vs

యర్రదాసరి ఎ.శెట్టి పల్లె సుమన్ జోషి S/o జోషోబు వయస్సు 35 సంవత్సరాలు, డోరే. నెం 27/201 వసంతపేట, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా.

...ప్రతివాది

సమను

పై నెంబరంలోని ప్రతివాది అయిన నాపైన, పైవాది దావా షెడ్యూల్ ఆస్థిని రిజిస్టర్ చేయమని దావా దాఖలు చేసి ఉన్నాడు. అట్టి దావాలో నీకు ఏమయిన ఆక్షేషనలు ఉన్నా యెడల పై కోర్టు యందు 22/6/2003 తేది ఉదయం 10:30 గంటలకు హాజరు అయి ఆక్షేషనలు తెలుపవలెను. లేని యెడల పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా : 22/6/2023

సీ. వరదరాజులు, బి.ఎ.బి.ఎల్బీ
అడ్వకేట్
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు

O.S.NO. 668/2021

డి.సుబ్బలక్ష్మి, W/o వెంకటచెన్నయ్య, 45 సం॥, డోర్‌నెం. 17/193, నడింపల్లి, ప్రొద్దుటూరు. **...వాది**

Vs

వంకదార ప్రవీణ్‌కుమార్, S/o ప్రభాకర్‌రావ్, హిందూ, 43 సం॥, డోర్‌నెం.11/84, సుందరాచార్యులవీధి, ప్రొద్దుటూరు. **...ప్రతివాది**

సమను/నోటీసు

పై నెంబరు దావాను వాది దావా మొత్తం వగైరాలు రా కోరి I.A.No.1012/2021 వ పిటిషన్‌ను పిటిషన్ షెడ్యూలు దాఖల ఆస్తిని జప్తీ చేయులాగున రెస్పాండెంట్/ప్రతివాది అయిన నీ పైన దాఖలు చేసి వున్నారు. అట్టి వాటిపై నీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల 20/6/2023వ తేదీన ఉ॥10.30గం॥లకు పై కోర్టు యందు స్వయంగా గానీ లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును అని తెలియచేయడమైనది.

వాయిదా తేది : 20.06.2023.

//By Order Of the Court//
ఎన్.వి.వరప్రసాద్
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కడప.

O.S.NO. 1008/2022

యం.వెంకటకొండయ్య, తండ్రి నాగప్పనాయుడు, హిందు, వయస్సు సుమారు 43సం॥లు, నివాసము, డోర్‌నెం.5/9, యర్రమాచుపల్లె, చింతకొమ్మదిన్నె మండలము, కడప జిల్లా. **...వాది**

Vs

బి.హరిక్రిష్ణ, తండ్రి డబ్ల్యు.వెంకటరమణ, హిందు, వయస్సు సుమారు 35 సం॥లు నివాసము, రాజారెడ్డివీధి, కడప. **...ప్రతివాది**

సమను

పై నెంబరు కేసును బాండు బాపతి విషయమై దాఖలు చేసినందున ఇందు విషయమై ఆక్షేపణలు వున్న యెడల 20/6/2023వ తేదీన ఉదయం 10.30గం॥లకు పై కోర్టులో ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మాణము చేయగలరని తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//
యం.నాగిరెడ్డి
వాది తరపున న్యాయవాది

IN THE COURT OF THE HON'BLE Ist ADDITIONAL DISTRICT JUDGE, KADAPA.

I.A.No. 940/2022

O.S.No. 57/2022

Shaik Fayaz Basha, S/o.S.Rafiq Basha, aged about 35 years, Muslim, Business, residing at D.No.53/304-9, Near Q&Q super Market, Kagitalapenta, Kadapa City.

...Petitioner/Plaintiff

Vs

Syed Amjad Ali S/o.Later S.Mohammad Jaffar, Muslim, aged about 38 years, Government Employee, Resident of D.No.21/580, Palempapaiah Street, Kadapa City, YSR District.

...Respondent/Defendant.

నోటీసు

పై కేసులో వాది ప్రతివాది అయిన నీ పై స్పెసిఫిక్ ఫర్ఫామెన్స్ దావా ఓ.యస్.నెం.57/2022 మరియు ఇంజక్షన్ కొరకు ఐ.ఎ.నెం.940/2022 పై కోర్టులో దాఖలు చేసినందున ప్రతివాది హాజరు నిమిత్తం వాయిదా 14.06. 2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు వాయిదా వున్నది. ప్రతివాది ఆ దినము పై కోర్టు నందు హాజరై ఆక్షేపణ వున్న ఎడల తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షములో కేసు తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేస్తున్నాము.

//By Order of the Court//
P.IMRAN KHAN
Advocate, KADAPA.

IN THE COURT OF THE HON'BLE Ist ADDITIONAL DISTRICT JUDGE, KADAPA.

O.S.No. 57/2022

Shaik Fayaz Basha, S/o.S.Rafiq Basha, aged about 35 years, Muslim, Business, residing at D.No.53/304-9, Near Q&Q super Market, Kagitalapenta, Kadapa City.

...Plaintiff

Vs

Syed Amjad Ali S/o.Later S.Mohammad Jaffar, Muslim, aged about 38 years, Government Employee, Resident of D.No.21/580, Palempapaiah Street, Kadapa City, YSR District.

...Defendant

నోటీసు

పై కేసులో వాది ప్రతివాది అయిన నీ పై స్పెసిఫిక్ ఫర్ఫామెన్స్ దావా ఓ.యస్.నెం.57/2022 వేసినారు. ప్రతివాది హాజరు కొరకు వాయిదా 14.06.2023 తేదీన ఉదయం 10.30 ని॥లకు వాయిదా వున్నది. ప్రతివాది ఆ దినము పై కోర్టు నందు హాజరై ఆక్షేపణ వున్న ఎడల తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షములో కేసు తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేస్తున్నాము.

//By Order of the Court//
P.IMRAN KHAN
Advocate,
KADAPA.